ఆంక్షలతో తల్లికి వందనం ఎగనామం

- 1710 మందికి అందని తల్లికి వందనం
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు
- అంగన్‌వాడీలను అనర్హులుగా ప్రకటన
- 23న ఏలూరు కలెక్టరేట్‌లో ధర్నా



పోస్టాఫీసులో తల్లికి వందనం వెరిఫికేషన్ కోసం పోస్ట్‌మేన్‌ను చుట్టుముట్టిన లబ్ధిదారులు

ఉంగుటూరు: ఆంక్షలతో తల్లులకు కూటమి ప్రభుత్వం ఎగనామం పెట్టింది. మండలంలో 1710 మంది లబ్ధిదారులకు తల్లికి వందనం డబ్బులు పడలేదు. దీంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ బిల్లులు ఎక్కువ వచ్చాయని, తదితర సాకులతో తల్లికి వందనం వేయలేదు. కొందరు సాంకేతిక ఇబ్బందితో డబ్బులు పడలేదు. తల్లులు పుస్తకాలు తీసుకొని పంచాయతీ ఆఫీసు వద్ద ఉంచిన జాబితాలు చూసుకునేందుకు పరుగులు తీశారు. చివరికి ఒక అబ్బాయి పేరుంటే, మరో అబ్బాయి పేరు లేక పోవడం గమనార్హం. ఇలా తప్పుల తడకగా జాబితాలు రావడంతో తల్లులు ఆందోళన చెందుతున్నారు. రూ.15 వేలకు గాను రూ.13 వేలు వేస్తున్నారు. 25 గ్రామ పంచాయతీల్లో రాని వారి వివరాలు ఇలా ఉన్నాయి. ఎ.గోకవరంలో 49 మంది, బాదంపూడిలో 70 మంది, బొమ్మిడిలో 54 మంది, చేబ్రోలు-1లో 124 మంది, చేబ్రోలు-2లో 115 మంది, గొల్లగూడెంలో 50 మంది, గోపాలపురంలో 62 మంది, గోపినాథపట్నంలో 51 మంది, కాగుపాడులో 49 మంది, కైకరం-1లో 110 మంది, కైకరం-2లో 79 మంది, కాకర్లమూడిలో 58 మంది, నాచుగుంటలో 61 మంది, తల్లికి వందనం పొందలేకపోయారు. అలాగే నారాయణపురం-1లో 54 మంది, నారాయణపురం-2లో 98 మంది, నీలాద్రిపురంలో 47 మంది, రాచూరులో 111 మంది, రావులపర్రులో 36 మంది, తల్లాపురంలో 30 మంది, ఉంగుటూరు-1లో 123 మంది, ఉంగుటూరు-2లో 94 మంది, ఉప్పాకపాడులో 62 మంది, వెల్లమిల్లి-1లో 22 మంది, వెల్లమిల్లి-2లో 61 మంది, యర్రమిల్లిపాడులో 39 మందికి తల్లికి వందనం పడలేదు. దీంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీలకు మొండి చేయి

దెందులూరు: తల్లికి వందనం పథకం అమలులో అంగన్‌వాడీ సిబ్బందికి కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపించింది. గౌరవ వేతనం తీసుకుంటున్న కారణంగా అర్హత లేదంటూ సమాచారం ఇవ్వడంతో అంగన్‌వాడీల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో తారతమ్యం లేకుండా అర్హత ప్రామాణికంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకాన్ని ఆదర్శవంతంగా అమలు చేశారు. విద్యా రంగానికి కొత్త హంగులు తీర్చిదిద్దారు. నాడు-నేడు, మనబడి పథకం అమలు దేశానికి ఆదర్శవంతం అయ్యేలా అనేక రాష్ట్రాల ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు ఆంధ్రాలో పర్యటించి పాఠశాలలను తిలకించారు. నేడు కూటమి ప్రభుత్వం పథకాన్ని మార్చి తల్లికి వందనమని పేరు పెట్టింది. స్థానిక ప్రజా ప్రతినిధులను, అంగన్‌వాడీ సిబ్బందిని అనర్హులుగా చూపించడంతో అంగన్‌వాడీలు రగిలిపోతున్నారు. తామెంత తమ గౌరవవేతనం ఎంతని కూటమి ప్రభుత్వం ఇలా తమపై సవితి తల్లి ప్రేమ చూపటం ఏ మాత్రం సబబు కాదని అంగన్‌వాడీ సిబ్బంది బాహాటంగా ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

ఒకరికే పడింది.. మరొకరికి పడలేదు



మాది ఉంగుటూరు గ్రామం, నా కుమార్తె, కుమారుడు చదువుకుంటున్నారు. నా మారుడు వెంకటసాయి దిలీప్ 9వ తరగతి చదువుతున్నాడు. కుమార్తె దేవీనిషిత 8వ తరగతి చదువుతోంది. అయితే కుమార్తెకు తల్లికి వందనం పడింది. కుమారుడు దిలీప్‌కు పడలేదు. దీంతో తీవ్ర ఆవేదన చెందుతున్నాను.

– నాగ సత్యవతి, ఉంగుటూరు

ముగ్గురు పిల్లల్లో ఒకరికి పడలేదు



మాది చాలా పేద కుంటుంబం. రోజూ పని చేసుకుంటే గాని కుటుంబం గడవని పరిస్థితి. ఈ నేపథ్యంలో మా ముగ్గురు పిల్లలు టి.జోష్న పదో తరగతి, తిషాత్ ఎనిమిదో తరగతి, వాసవీ ఏడో తరగతి చదువుతున్నారు. ఎంతో ఆశతో ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం వస్తుందని ఎదురు చూశాను. ముగ్గురు పిల్లల్లో ఒకరికి తల్లికి వంతనం రాలేదు. మేము ద్యుత్ కూడా చాలా తక్కువ వాడతాం. అయినా విద్యుత్ ఆంక్షలతో తల్లికి వంతనం వేయకపోవడం విచారకరం.

– నాగమణి, ఉంగుటూరు

23న ఏలూరులో ధర్నా



తల్లికి వందనం పథకం అమలులో అంగన్‌వాడీలను అనర్హులుగా చేయటం సరైన నిర్ణయం కాదు. వారికి ఇచ్చే గౌరవ వేతనం చాలా తక్కువ కుటుంబం ఆ గౌరవ వేతనంతో గడవదు. అంగన్‌వాడీలకు న్యాయం చేసేంతవరకు పోరాడతాం. ఈ నెల 23న ఏలూరు కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తాం.

– భారతి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ మద్దతు



తల్లికి వందనం పథకానికి అంగన్‌వాడీలను, స్థానిక ప్రజా ప్రతినిధులను అనర్హులుగా కూటమి ప్రభుత్వం పరిగణించటం బాధాకరం. గత ప్రభుత్వంలో ఇలా సవతి తల్లి ప్రేమ చూపించ లేదు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ అమ్మఒడి వర్తింపజేశారు. నేడు సర్పంచులకు, ఎంపీపీలకు, అంగన్‌వాడీలకు తల్లికి వందనం అర్హత లేదంటూ ప్రకటించడం బాధాకరం. అందరికీ న్యాయం జరిగే వరకూ వైఎస్సార్‌సీపీ మద్దతుగా ఉంటుంది. – నిట్టా లీల నవకాంతం, జెడ్పీటీసీ, దెందులూరు

క్లుప్తంగా

చర్చి నిర్మాణ పనుల పరిశీలన



చర్చి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కామిరెడ్డి నాని

దెందులూరు: మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఆర్థిక సాయంతో నిర్మిస్తున్న ఆర్‌సీఎం చర్చిని సోమవారం నాగులదేవునిపాడులో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షులు కామిరెడ్డి నాని పరిశీలించారు. ఈ సందర్భంగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గాలాయగూడెం సర్పంచ్ చిలక వెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మునునూరి శివ, తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు విద్యార్థికి స్కాలర్‌షిప్



విద్యార్థి సుమంత్

దెందులూరు: దెందులూరుకు చెందిన గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్ సుమంత్ (వినికిడి లోపం)కు జాతీయస్థాయి దివ్యాంగుల పెన్షన్ మంజూరు అయిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పడ్లపట్ల విజయకుమార్ అన్నారు. సోమవారం పాఠశాలలో ఆయన మాట్లాడుతూ సుమంత్ ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో మూడో స్థానం సాధించారన్నారు. రూ.9 వేలు జాతీయ స్థాయి స్కాలర్‌షిప్ మంజూరైందని వినికిడి లోపం ఉన్న పాఠశాలలో మూడో స్థానం సాధించడంలో అతడి పట్టుదల నిరంతర శ్రమ అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు డి.సుధీర్‌కుమార్, వెంకటేష్, ప్రభుపాల్, గ్రంథ పాలకుడు గొల్లపూడి వెంకటేశ్వరరావు అభినందించారు.

చదివిన పాఠశాలకే ఉపాధ్యాయులుగా..



బాధ్యతలు స్వీకరిస్తున్న ఉపాధ్యాయులు

ఉంగుటూరు: చదువుకున్న పాఠశాలకే ఉపాధ్యాయులుగా బదిలీపై రావడంతో వారిలో పట్టరాని సంతోషం వెలువడింది. బదిలీల్లో భాగంగా బాదంపూడి మోడల్ పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా రేగాని రామకృష్ణ, సహ ఉపాధ్యాయులుగా అల్లు శ్రీను, శింగవరపు శ్రీను బదిలీపై బాదంపూడి వచ్చారు. వీరు అదే పాఠశాల పూర్వ విద్యార్థులు కావడం గమనార్హం. బదిలీలో భాగంగా రేగాని రామకృష్ణ దేవరపల్లి నుంచి, అల్లు శ్రీను ఉప్పాకపాడు నుంచి, శింగవరపు శ్రీను బాదంపూడి నంబర్-3 నుంచి వచ్చారు. వారు చదువుకున్న పాఠశాలకు రావడం సంతోషంగా ఉందని చెప్పారు. పాఠశాల విద్యా అభివృద్ధికి కృషి చేస్తామని వారు వివరించారు. సొంత పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను గ్రామస్తులు స్వాగతించారు.

సాయిబాబా రథయాత్రకు ఘన స్వాగతం



రథయాత్రకు ఘన స్వాగతం పలికిన జిల్లా అధ్యక్షుడు శశిశేఖర్, ప్రతినిధుల బృందం

భీమడోలు: భగవాన్ శ్రీసత్య సాయిబాబా ప్రేమ ప్రవాహిని రథయాత్ర సోమవారం మండలంలోని గుండుగొలనులో వైభవంగా నిర్వహించారు. భగవాన్ శ్రీసత్యసాయి శత జయంతిని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా ప్రేమ ప్రవాహిని రథయాత్ర నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గుండుగొలను గ్రామానికి చేరుకుని రథానికి సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మేళ తాళాలు, మంగళవాయిద్యాలు, కోలాట నృత్యాలతో గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వర్దినీడి సత్యసాయి, సేవా సమితి అధ్యక్షుడు కోడూరి లక్ష్మీనరసింహామూర్తి, కొండా గంగరాజ్‌కుమార్, జి.సుబ్బారావు, యలమర్తి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోట ఏవోగా ముత్యాలరావు

కామవరపుకోట: కామవరపుకోట మండల వ్యవసాయ అధికారిగా డి.ముత్యాలరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బుట్టాయిగూడెం ఏవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో టి.నరసాపురం మండల ఏవోగా పనిచేస్తూ కామవరపుకోటకు ఇన్‌ఛార్జిగా పనిచేశారు. ఇక్కడ పనిచేసిన సి.పవన్ కుమార్ జంగారెడ్డిగూడెం ఏవోగా వెళ్లారు.

కొయ్యలగూడేనికి పోశారావు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మండల వ్యవసాయ శాఖ అధికారిగా కేవీఎస్ పోశారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జంగారెడ్డిగూడెం నుంచి బదిలీపై రాగా వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నాయకులు పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో అభినందించారు.

జ్వరాన్ని నిర్లక్ష్యం చేయొద్దు



పిప్పరలో ప్రదర్శన చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

గణపవరం: మారుతున్న వాతావరణ పరిస్థితులు అనేక వ్యాధులకు కారణమవుతున్నాయని, జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలని తాడేపల్లిగూడెం డివిజన్ మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు, పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రియాంక అన్నారు. సోమవారం పీహెచ్‌సీ పరిధిలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా సిబ్బంది మలేరియా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవడం ద్వారా మలేరియాను గుర్తించి, తగిన చికిత్స అందించొచ్చన్నారు. ప్రతి శుక్రవారం పొడివారంగా పాటించాలని, ఇంటి పరిసరాల్లో మురుగు నీరు, తడి లేకుండా చూసుకుంటే దోమల వ్యాప్తి తగ్గుతుందన్నారు. దోమల ద్వారా మలేరియా, డెంగీ వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి దివ్య, సీహెచ్‌వో జి.వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొబ్బరి దుంగ పడి వ్యక్తి మృతి

పెదవేగి: కొబ్బరి చెట్టు నరుకుతున్న వ్యక్తిపై ఆ చెట్టు దుంగ పడి మృతి చెందిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. పెదవేగి ఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం విజయరాయి గ్రామంలో కొబ్బరి తోటలో కొబ్బరి చెట్టు నరికేందుకు దెందులూరు మండలం గాయాలగూడేనికి చెందిన యడ్లరాటాలు కూలి పనికి వెళ్లాడు. ఈ నేపథ్యంలో చెట్లను నరుకుతుండగా, అతడిపై దుంగ పడి అపస్మారక స్థితి వెళ్లాడు. దీంతో స్థానికులు స్పందించి హుటాహుటిన ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాటాలు (55) మృతి చెందినట్లు ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



సీతారామస్వామి వారు

భీమడోలు: దేవాదాయ ధర్మదాయ శాఖ పరిధిలో జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శ్రీసీతారామ స్వామి ఆలయ 133వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఫౌండర్ కొండ గంగ రాజ్‌కుమార్ పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు సుధీరాచార్యులు, దివి గోపాలాచార్యులు సంయుక్త ఆధ్వర్యంలో శ్రీసీతారామ, లక్ష్మణ, హనుమ మూల విరాట్‌లకు విశేష పూజా ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు కనుల వేడుకగా నిర్వహించారు. ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. శ్రీసీతారామ స్వామి వార్లను విశేషాలంకరణ చేశారు. స్వామి వారికి అభిషేకాలు, తులసీ దళార్చన, ప్రత్యేక పూజలు, పుష్పార్చనలు నిర్వహించి ప్రత్యేక హారతులు పట్టారు. అదే విధంగా ఆలయంలోని ఉత్సవ మూర్తులకు పూజలు చేశారు. ఈ సందర్భంగా కొండ గంగ రాజ్‌కుమార్ మాట్లాడుతూ గురుకొలనుగా పిలువబడే గుండుగొలను గ్రామంలో 1892వ సంవత్సం నుంచి ఆలయంలో సీతారామ స్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని, 133వ ఉత్సవాలు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి



విద్యార్థులకు కిట్లను అందజేసిన హెచ్‌ఎం

భీమడోలు: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని సూరప్పగూడెం సర్పంచ్ వెజ్జు బాలాజీ నాయుడు అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు ప్రాథమిక పాఠశాల, గుండుగొలనులోని మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో సోమవారం శ్రీసర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. పాతూరు పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం మండే సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు జాతీయ పాఠ్య పుస్తకాలు, మూడు జతల యూనిఫామ్‌లను అందజేశారు. గుండుగొలను మోడల్ ప్రైమరీ పాఠశాలలో హెచ్‌ఎం పాశం పాండురంగారావు విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్‌లను అందించారు. కార్యక్రమాల్లో ఎస్‌ఎంసీ చైర్మన్లు షేక్ సీమ, కాలి సురేష్, తియ్యల స్వాతి, వెజ్జు రాంబాబు, టీచర్లు సంధ్య, దీప్తి, రామకృష్ణంరాజు, గంగాదేవి, తదితరులు పాల్గొన్నారు.


● ఖరీఫ్‌కు రైతన్న సిద్ధం



నారుమడులకు పెట్టిన నీరు (ఇన్‌సెట్లో) దుక్కి దున్నుతున్న రైతన్న

గ్రామ గ్రామాన ఖరీఫ్ సాగు పనులు ప్రారంభం అయ్యాయి. మండలంలో 15,475 ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేస్తున్నారు. రోహిణి కార్తి వెళ్లి మృగశిర కార్తె ప్రవేశించడంతో రైతులు సంతోషంతో సంప్రదాయబద్ధంగా పొలాల్లో నాగళ్లకు పని చెప్పారు. ఏ గ్రామంలో చూసిన రైతులు పొలాల్లో గట్లు సరి చేయడం, నీళ్లు పెట్టడం నాగళ్లు, ట్రాక్టర్లతో దున్నటం కనిపించింది. ఖరీఫ్ సాగు మొదలవడంతో రైతులు వ్యవసాయ పనులను ఆరంభించారు. - దెందులూరు

యోగాతో మానసిక ఆరోగ్యం



యోగా చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

గణపవరం: యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం కలుగుతుందని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మకుమారి అన్నారు. సోమవారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల అనంతరం కళాశాల తిరిగి ప్రారంభించబడిందని, ఈ సందర్భంగా విద్యార్థుల మానసిక, శారీరక జాగృతి కోసం మెడిటేషన్, యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు యోగాసనాలు వేసి, ధ్యానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ కె.స్వరూపరాణి, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ జి.వెంకట రమణ ఐక్యు ఏసీ కో-ఆర్డినేటర్ చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ఏడాది పాలన అస్తవ్యస్తం



జగన్ అంటే నమ్మకం, బాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వాసుబాబు, వైఎస్సార్‌సీపీ నేతలు

గణపవరం: కూటమి ఏడాది పాలన అస్తవ్యస్తంగా అట్టర్ ప్లాఫ్ అయిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కూటమి నేతలు సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆయన వైఎస్సార్‌సీపీ రూపొందించిన కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో వైఫల్యాలపై రూపొందించిన పుస్తకాన్ని ఆయన పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలవి కాని హామీలతో ప్రజలను నమ్మించి గద్దెనెక్కడం, తరువాత వారిని మోసం చేయడం చంద్రబాబుకు అలవాటుగా మారిందని విమర్శించారు. 2019లో ఇచ్చిన హామీలను వైఎస్ జగన్ ఎలా అమలు చేశారో, గతేడాది చంద్రబాబు ఇచ్చిన హామీలను ఎలా అమలు చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని, జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసమని ప్రజలు గుర్తించారన్నారు. ప్రజలు నిలదీసే పరిస్థితి రావడంతో అరకొరగా ఉచిత గ్యాస్ సిలిండర్, అమ్మకు వందనం పథకాలను అమలు చేస్తున్నారని, రైతులకు, మహిళలకు, నిరుద్యోగులకు, ఉద్యోగులకు, యువతకు ఇచ్చిన హామీలన్నీ ఏమయ్యాయని వాసుబాబు ప్రశ్నించారు. హామీలన్నీ అమలు చేయించే బాధ్యత తనదని చెప్పిన పవన్‌కల్యాణ్ ఇప్పుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ పాపాలు నిండుతున్నాయని త్వరలోనే వీరి పాపం బద్దలవుతుందన్నారు. ఏడాది పాలనలో వైఎస్ జగన్‌ను ఆడిపోసుకోవడం, ప్రశ్నించిన వారిని వేధించడం, వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టడం తప్ప కూటమి ప్రభుత్వం సాధించిందేముందని వాసుబాబు ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా పుస్తకాన్ని ఆవిష్కరించిన వాసుబాబు కూటమి పాలనలో జరుగుతున్న దోపిడీ, దౌర్జన్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సిపి రాష్ట్ర కమిటి నాయకులు నడింపల్లి సోమరాజు, మాదేటి సురేష్‌కుమార్, ఎలిశెట్టి పాపారావు, నిడమర్రు జెడ్పీటిసి సభ్యుడు కోడే కాశీ, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, పార్టీ నాయకులు వెజ్జు వెంకటేశ్వరరావు,వెల్లంకి నరేష్, రొంగల శ్రీను, బేతు స్వామి పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

దెందులూరు: దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి క్యాంపు కార్యాలయం (ఏలూరు అశోక్ నగర్)లో మాజీ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వైఎస్ జగన్ అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణ నిర్వహిస్తామని కార్యాలయం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

వివాహిత ఆత్మహత్య

పెదవేగి: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుని బలన్మరణం పొందింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం అంకన్నగూడెం గ్రామానికి చెందిన పల్లెపాముల సౌందర్య గత కొంత కాలంగా కుటుంబంలో తలెత్తిన కలహాలతో మనస్తాపానికి గురై సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్ హుక్కుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనలో సౌందర్య (32) మృతి చెందిందని స్థానికులు చెబుతున్నారు. మృతురాలికి భర్త సురేష్, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్

దెందులూరు: కోళ్ల వ్యర్థాలు సరఫరా చేస్తున్న వాహనాన్ని దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ సోమవారం సీజ్ చేశారు. ఈ నెల 13న హైదరాబాద్ నుంచి గుండుగొలను తీసుకెళుతున్న దాదాపు లక్ష రూపాయలు పైగా విలువ చేసే కోళ్ల వ్యర్థాల లోడును రవాణా చేస్తున్న బొలెరో వాహనాన్ని విచారణ అనంతరం సీజ్ చేశామని తెలిపారు. ఈ కేసులో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని, విచారణ చేస్తున్నామని ఎస్సై ఆర్.శివాజీ వివరించారు.


నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు: భీమడోలు సెక్షన్, పూళ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని మొక్కలు నరకడం, విద్యుత్ కొత్త లైన్లు ఏర్పాటు చేస్తున్నామని ఏఈ శివాజీ తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీ మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ సోమవారం రాత్రి తెలిపారు. పూళ్ల గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించాలన్నారు. అదేవిధంగా విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ట్రాక్టర్ ట్రక్కు బోల్తా

జంగారెడ్డిగూడెం: స్థానిక పేరంపేట రోడ్డు అయ్యప్ప టౌన్‌షిప్ వద్ద ట్రాక్టర్ ట్రక్కు బోల్తా పడింది. కలప చెత్త లోడుతో వెళుతున్న ట్రాక్టర్ అదుపు తప్పడంతో రోడ్డు పక్కకు తిరగబడింది. ఈ క్రమంలో అక్కడే పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనంపై ట్రక్కు పడిపోవడంతో ద్విచక్ర వాహనం ధ్వంసమైంది.

వేగంగా సర్వే పనులు



రీసర్వే చేస్తున్న అధికారులు

దెందులూరు: మండలంలో పైలెట్ ప్రాజెక్టు గ్రామాలైన రామారావుగూడెం, ముప్పవరం గ్రామాల్లో రీసర్వే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని దెందులూరు తహశీల్దార్ బీ.సుమతి అన్నారు. సోమవారం రీసర్వే దెందులూరు మండలం డిప్యూటీ తహశీల్దార్ రవిచంద్రతో కలిసి పనులను తహశీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా మండల రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ రవిచంద్ర తహశీల్దార్ తో మాట్లాడుతూ రామారావు గూడెం గ్రామంలో 69 ఎకరాలు, ముప్పవరం గ్రామంలో 397 ఎకరాల్లో, రీసర్వే పనులు సర్వేయర్లు చేస్తున్నారన్నారు. ప్రాథమిక దశలో భూమిపై హక్కుదారుడు విస్తీర్ణాన్ని నమోదు చేసి రికార్డుల్లో పొందుపరిచే కార్యక్రమం దాదాపు పూర్తికావచ్చిందన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియ రైతులభూ భద్రత కోసం జరిగే శాశ్వత ప్రక్రియ అన్నారు. రైతులందరూ రీసర్వే రెవెన్యూ సిబ్బందికి తమ పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందించాలన్నారు ఆమె వెంట మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని ఉన్నారు.

అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



అతిసార నిరోధక కార్యక్రమంపై సూచనలిస్తున్న వైద్యాధికారి

గణపవరం: అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ఓంకార్‌నాథ్ అన్నారు. ఈ నెలాఖరు వరకూ నిర్వహించే అతిసార నిరోధక కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని గణపవరం పీహెచ్‌సి వైద్యాధికారి ఓంకార్‌నాథ్ అన్నారు. సోమవారం గణపవరం-2 సచివాలయ పరిధిలో ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ పార్ట్‌నైట్ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఐదేళ్ల లోపు పిల్లల వివరాలు సేకరించాలని, వాళ్లకు నీళ్ల విరేచనాలు అయితే వారిని గుర్తించి వారికి ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ టాబ్లెట్స్ ద్వారా చికిత్స అందించాలని సూచించారు. సీహెచ్‌వో జాలాది విల్సన్ మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో 2190 మంది ఐదేళ్ల లోపు పిల్లలు ఉన్నారని, వీరందరికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి



పోలవరం వ్యవసాయ కార్యాలయంలో రైతు జాబితాను అందజేస్తున్న వ్యవసాయ అధికారి

పోలవరం రూరల్: 2025-26 సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ పనుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం ప్రారంభించినట్లు పోలవరం ఏవో కె.రాంబాబు తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో అన్నదాత సుఖీభవ పథకం జాబితాను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పోలవరం మండలానికి సంబంధించి 5,161 మంది రైతుల జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించడం జరిగిందన్నారు. రైతు సేవా కేంద్రంలో ఉన్న గ్రామ సిబ్బందితో ఈ-కేవైసీ పూర్తి చేసిన తదుపరి మాత్రమే ఈ పథకానికి అర్హులన్నారు. గూటాల, కొత్త పట్టిసీమలో 1,517 మంది రైతులు, పోలవరంలో 1174, పట్టిసీమలో 646, ప్రగడపల్లిలో 534 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు.